


**రంగారావుగారికి రవ్వంత కూడా మనశ్శాంతి వుండటంలేదు. కూతురిపెళ్లి చేశామన్న తృప్తీ లేదు. అలాగని ఇన్నేళ్లు తమ వద్ద వున్న కూతురు అత్తవారింటికి వెళ్ళిపోయిందన్న దిగులూలేదు.**

అయినవాళ్ళు, ఆత్మయులు మాటల సందర్భంలో "ఇంకా మీకు దిగులే ముందుండి అమ్మాయి పెళ్లి చేసేశారు. సొంత ఇల్లువున్నది. నెలనెలా వచ్చే అద్దె, పింఛను డబ్బుతో మీ భార్యాభర్తలకు గడవకపోదు. అబ్బాయికి వుద్యోగం వచ్చింది కూడా. ఇక మొగపిల్లవాడి పెళ్లి గురించి ఆదుర్దాపడాల్సిన వనేముంది గనుక" అని అనటం రంగారావుగారికి నవ్వు తెప్పిస్తుంది.

ఆడపిల్ల పెళ్లి చేసిన తండ్రిని ఓ గొప్ప ఘనకార్యం చేసేసిన వాడిలా పొగడటం, ఇక జీవితంలో దిగులుపడవలసిన అవసరం ఏదీ లేదంటూ తేల్చి చెప్పేయడం ఆయనకు ఎంత ఆలోచించినా అర్థం అయ్యేదికాదు.

"అమ్మాయి పెళ్లి ముందునుంచి గమనిస్తున్నాను మీరేమిటో ముభావంగా వుంటున్నారు. దేని గురించో ఒకటే ఆలోచిస్తూ మీలో మీరే దిగులుపడుతున్నారు. ఇన్నాళ్లు కాపురం చేశాం మనసులో మాట ఏమిటో నాకూ చెప్పొచ్చుగా" కొంత నిష్టూరం, మరి కొంత దిగులు మేళవించి అన్నది భార్య సుగుణమ్మ.

'అవున్నిజమే. ఆమెతో చెప్తే తప్పేముంది. పైగా మనసులో వేదన ఇతర్లతో చెప్పకుంటే కొంత మనశ్శాంతి కూడా పొందవచ్చంటారు' అనుకున్నారు రంగారావుగారు.

'మనసులోని ఆవేదనంతా ఆమెకు చెప్పేస్తే.... ఆవిడెలా అర్థం చేసుకుంటుందో. నన్ను ఇదివరకులా ప్రేమిస్తుందా, ఆదరిస్తుందా' సందేహం కలిగిందాయనకు.

తను చేసిన వన్నీ తప్పో, ఒప్పో జరిగిపోయాయ్. కాని వాటినలా రహస్యంగా తనలోనే దాచుకుని... అతర్మధన పడటం ఆమె గ్రహించింది. ఇప్పుడు కూడా చెప్పకపోతే ఆమె మనసు మరింత బాధపడుతుంది. అందుకే ఏది ఎలా జరిగినా తన ఆవేదనంతా అర్ధాంగికి చెప్పటానికే

నిర్ణయించుకున్నారు రంగారావుగారు.

బంధువుల ఇంటికి పేరంటానికి వెళ్లిన భార్య రాక కోసం ఎదురు చూస్తూ వాలు కుర్చీలో పడుకున్నాడాయన. సంతోషాన్నయినా, విచారాన్నయినా కావలసిన వ్యక్తుల్తో పంచుకుంటేనే తృప్తి. వాటి విలువ కూడా అలా పంచుకోవటంతోనే పెంచుకోవచ్చు కూడా.

అలా ఆవిడకోసం ఎదురు చూస్తున్న రంగారావు గారి మనసులో మెరుపులా ఓ ఆలోచన.

'చెప్పాలనుకున్న విషయాలన్నింటిని ఆమెకు ఎదురుగా కూర్చుని చెప్పటం కష్టమేమో. పైగా విషయాలన్ని వివరంగా విశదీకరించలేనేమో' అందుకే తన మనోభావాలన్నింటికి అక్షర రూపం ఇవ్వదలిచాడాయన.

వెంటనే కాగితం కలం పట్టుకొచ్చుకున్నాడు లోపలికి వెళ్లి.

డాబా మీదకు వెళ్లి తన అంతరంగ తరంగాలతో వాక్య నిర్మాణం ప్రారంభించారు రంగారావుగారు. ఉవ్వెత్తున ఎగిరిపడుతున్న ఆలోచనావేశాలను ఉపశమింపచేసుకుంటూ వ్రాయసాగాడాయన.

సుగుణా:

ఇలా సంబోధిస్తూ నీకు ఎన్నో ఉత్తరాలు వ్రాశాను మన పెళ్లికి ముందు, తర్వాత కూడా కొంతకాలం. పెళ్లికి ముందు మనం వ్రాసుకున్న ఆ ఉత్తరాలన్నీ ఇంకా నా దగ్గర వున్న విషయం నీకూ తెలిసిందే. ఎప్పుడయినా మనసు బాగుండకపోతే వాటిని ముందేసుక్కూర్చుంటావన్నది నీవు ఎరిగిన విషయమే.

మన అబ్బాయి పుట్టినప్పుడు కాబోలు మీనాన్న నాకు వ్రాసిన ఉత్తరానికి బదులుగా ఆయనకు ఒకటి నీక్కూడా వేరుగా ఓ ఉత్తరం వ్రాశాను. నాకు జ్ఞాపకం వున్నంతవరకూ అదే నేను నీకు చివరిసారిగా వ్రాసిన ఉత్తరం. ఆటు తర్వాత నీకు ఉత్తరం వ్రాయాల్సిన అవసరం కలగలేదు.

ఇప్పుడు.... ఇన్ని సంవత్సరాల తర్వాత నీకు ఉత్తరం వ్రాస్తున్నాను. ఇన్నేళ్ల మన సంసారంలో ఎన్ని సంతోషకరమైన సంఘటనలు జరిగినయ్యో, ఎన్ని కష్టాలు ఎదురైనవో నీకూ తెల్సు. నిన్నెంతవరకు సుఖపెట్టానో చెప్పవలసింది నీవు. చాలీచాలని నా ఆదాయంతో నీ కోర్కెలు ఎన్నింటిని చంపుకున్నావో నీవు పెదవి విప్పి చెప్పకపోయినా నాకు తెల్సు. నా సంతోషం కోసం, నా తృప్తి కోసం నీ అయిష్టాలనెన్నింటినో ఇష్టంగానూ మరెన్నో ఇష్టాల్ని అయిష్టాలుగానూ మార్చుకున్నావు.

ఎప్పటికప్పుడు ఈ ఆలోచనలను, బాధలను నీ చల్లటి చిరునవ్వుతోనూ, నీ ఆప్యాయతతోను మరచిపోవటం నాకు అంత కష్టం అనిపించలేదు. పిల్లలు పుట్టాక మన ఇద్దరి ఆలోచనా వారిపైనే వుండటం ప్రారంభం అయింది.

తల్లి తండ్రులిద్దరికి పిల్లల మీద ప్రేమ ఒక స్థాయిలో వుండటం నిజమే అయినా పిల్లలకు మాత్రం తల్లంటే ప్రత్యేక స్థానం, ఎక్కువ చనువు వుండటం కూడా అంత నిజం.

"మీరు పిల్లల పట్ల మరీ కఠినంగా వుంటున్నారు" అని నీవు ఎన్నోసార్లు నాతో అనేదానివి. నీవు అలా అన్న ప్రతిసారి ముక్తసరిగా, ముభావంగా వుండే వాడిన్నేను.

ముఖ్యంగా ఈ ఉత్తరంలో నేను వ్రాయదలుచుకున్న విషయం మన అమ్మాయి కమల గురించి. ఇక ఆ విషయం ప్రారంభిస్తాను.

నీకు గుర్తుండే వుంటుంది. కమల పసి వయసులో నన్ను రకరకాల కోరికలు కోర్తుండేది. నిన్ను అది ఏమడిగినా 'నాన్న గారిని అడుగు' అంటూ నా దగ్గరకు పంపి ముసిముసిగా నవ్వుకునే దానివి.

అది నన్ను ఏది అడిగినా "అలాగే కొందాం" అని ఓ తియ్యని అబద్ధం చెప్పి మరిపించేవాడిని. తెలిసీ తెలియని వయసులో పిల్లలు ఏవేవో అడిగినప్పుడు సహజంగా ఏ తల్లితండ్రులయినా అలాగే చెప్తుంటారు కదా. అందుకే నేను దాన్తో అలా అబద్ధాలు చెప్పినందుకు ఎప్పుడూ విచారించలేదు. నేను 'సరే' అన్నప్పుడల్లా ఆ పసి ముఖంలో కనిపించే ఆనందం ఇప్పటికీ నా కళ్లముందు కదలాడుతుంటుంది. అదే సమయంలో నా ఆర్థిక స్తోమత నన్ను వికృతంగా వెక్కిరిస్తూనూ వుంటుంది.

మనం ఎన్నోసార్లు పాపను తీసుకుని బట్టలకొట్టుకు వెళ్లి వుంటాము. అక్కడ దానికి నచ్చిన వాటిని చూపుతూ అవి కొనమని మారాం చేసేది. అవన్నీ పిచ్చి వంటూ ఇద్దరం మభ్యపెట్టే వాళ్లం. అప్పటికీ వినకపోతే విసుక్కునే వాళ్లం, ఆ పసిదానిపైన విరుచుకుపడే వాళ్లం. కొన్నాళ్లు అలా మనతో విసిగిపోయిన ఆ చిన్నారి మనసులో ఎన్ని భావాలు కలిగినయ్యోకాని ఆటుపై ఎటువంటి పేచీ పెట్టనట్లు నాకు గుర్తు.

అమ్మాయి పెద్దదయింది. స్కూలు చదువు పూర్తి చేసింది. పదోతరగతి ఫస్టు క్లాసులో పాసయిందని మనం ఎంతగానో



"భక్త మార్కండేయ విజయం" (శ్రీశైల ప్రాకార శిల్పం)
ఫొటో: వెల్లటూరి పూర్ణానందశర్మ, (వెల్లటూరు)




విజేతలకు స్వాగతం చెప్తూ
పదవీచ్యుతులకు వీడ్కోలు యిస్తూ
నిన్నటికి నేటికి వారధులం
చరిత్ర నడిపే సారథులం
ఇన్నేళ్ళుగా
ఎన్నో ఏళ్ళుగా
పదవి కోసం పోరాటంలో
ఎదురొడ్డి నిలిచి గెలిచినవారు కొందరు
వెన్నుపోడిచి గెలిచినవారు కోకొల్లలు
పదవీచ్యుతులంతా అపవిత్రులు కారు
పదవి వరించిన వారంతా పవిత్రులు కారు
అవినీతి బంధుప్రీతి
కుళ్ళు కుతంత్రం మోసం దగా
మాపై నడుస్తూ పూసిన మసి
న్యాయం సత్యం ధర్మం ప్రేమ
మాపై నడుస్తూ పూసిన సుగంధం
నాటికి నేటికి
మా మనసులోని మాట
పేదవాడి ఇంటి వాకిట
జీర్ణావస్త్రలో నిలిచి
బాధగా మోపిన
పాదాల్ని ప్రేమగా
నడుంవంచి మోస్తున్నాం!
కలవారి ఇంటి వాకిట
పాలరాయిని కప్పుకొని
నగిషీలు చెక్కుకొని
కర్కశంగా వేసిన బూటుకాలును
నడుం విరిగి మోస్తున్నాం!

—అడిగోపుల వెంకటరత్నమ్

సంతోషించాం.

"నేను సైన్సు గ్రూపే చదవాలి" అని అది ఎంతగా పట్టుదల చూపిందో కదూ.

ఆ గ్రూపు ఖర్చుతో కూడుకున్నదని అంతశక్తి నాకు లేదని ఆ లేత మనసుకు చెప్పి నొప్పించటం నాకు చేతకాలేదు. చెప్పటం చేతకాలేదు కాని చేతల్లో చేసి చూపిన అభాగ్యుడ్ని నేను. ఈ నిజం నీకూ ఇంతవరకు చెప్పనందుకు క్షమించు.

మనసు చంపుకుని రెండు మూడు సార్లు అమ్మాయి మనసు మార్చటానికి ప్రయత్నించాను. వేరే గ్రూపు చదవమని ప్రోత్సహించాను. కాని ఆ చిన్నారి మనసులోని బలీయమైన కోరిక నా మాటల్ని ఖాతరు చేయనీయలేదు. మొదటిసారిగా నాతో పౌరుషంగానూ, పరుషంగా కూడా మాట్లాడింది.

ఇక దాన్ని ఒప్పించడం కష్టమైన పని అనుకున్నాను. అందుకే కాలేజి ప్రిన్సిపాల్ దగ్గరకు వెళ్లి నా గోడు వెళ్లబోసుకున్నాను. నా బాధను అర్థం చేసుకోమన్నాను. కష్ట సుఖాలు తెలిసిన మనిషి కాబోలు నన్ను తిట్టకుండా మౌనంగా తలాడించాడు నా అభీష్టానికి అంగీకార సూచనగా.

ఫలితంగా అమ్మాయికి సైన్సు గ్రూపులో సీట్లు అయిపోయినవని, ఇంకా ఆలస్యం అయితే మిగతా గ్రూపుల్లో కూడా సీట్లుండవని చెప్పటం జరిగింది. ఆయనలా చెప్పే డనేకంటే నేను చెప్పించానంటే నిజం నిర్భయంగా నీ ముందు చెప్పినట్లు వుంటుంది. కాలేజి చదువుకే ముప్పు వాటిల్లుతుందనే భయం వలన కాబోలు అయిష్టంగానే ఆ గ్రూపులో చేరటానికి అంగీకరించింది కమల.

కొత్తగా, కాలేజి చదువు ప్రారంభించానన్న ఆనందం ఆ పిల్ల మొఖంలో వెతికినా కనిపించలేదు నాకు. నిర్లిప్తంగా యాంత్రికంగా అలా కాలేజీకి వెళ్లి వచ్చే దాన్ని చూసినప్పుడల్లా నా మనసు విలవిల్లాడిపోయేది. నా మీద నాకే అసహ్యం వేసేది.

చదువు మీదున్న శ్రద్ధతో, సహజంగా వున్న తెలివితేటల్తోనూ అది చదువులో బాగానే రాణించింది. అంత తెలివైన పిల్లను, తను కోరిన చదువు చెప్పించలేకపోయిన నిర్భాగ్యపు తండ్రిని నేను. విచక్షణా రహితంగా దాని కోరికను మొదలంటూ నరికివేశాను.

పెద్దగీతముందు చిన్నగీత అన్నట్లు అప్పట్లో ఆవిషయానికి ఎంతో సిగ్గుపడిననేను, ఇప్పుడు ఆలోచిస్తే అదిచాలా మామూలు విషయంగా అనిపిస్తున్నది.

మొన్న కాకినాడ సంబంధం వారు, హైదరాబాద్ వారు వచ్చి పెండ్లి చూపులు చూసి వెళ్లారు కదా సుగుణా. ఆ ఇద్దరికి అమ్మాయినచ్చిందట. ఈ విషయం తెలియగానే ఆశ్చర్యపోతున్నావుకదూ, నిజమే మన అమ్మాయి వారిరువురికి నచ్చింది.

అమ్మాయి కాకినాడ సంబంధం అంటే ఎక్కువ ఇష్టపడుతున్నట్లు చెప్పేవు. అందం, ఆస్తి విషయాలోనూ, ఉద్యోగం, హోదా విషయంలోనూ అతన్ని కోరుకున్నది కమల. ఈవిషయం ఆమె మనకు సూటిగా చెప్పక పోయినా నీ తల్లి మనసు గ్రహించి ఈ నిర్భాగ్యపు తండ్రికి వివరించింది. ఇద్దరి అభిప్రాయాలు సేకరించాం.

కాకినాడ వారు అడిగిన కట్నం, కోరిన లాంఛనాలు నా స్థోమతకు మించిపోయినై. నేను వారితో సరితూగలేనేమో ననిపించింది. మరి కొంత అప్పు చేసయినా సరే పిల్లని వారికే ఇచ్చేద్దామంటే పెళ్లి అయ్యాక కూడా వారి కోరికలు వగైరాలు నాకు భయం కలిగించినై.

నా స్థోమతకు, నా శక్తికి తగినట్లుగా అనిపించిన హైదరాబాద్ సంబంధం

ఖాయం చేసుకుని వచ్చాను.

'కాకినాడ వారికి నీవు నచ్చలేదు టమ్మా'అని చెప్పకూడని అబద్ధం చెప్పేను. పిచ్చితల్లి ఈ మాటకు ఎంత బాధ పడిందో. నా బంగారు తల్లి నచ్చకపోవటమా. ఆ మాట నా నోటితో నేను ఆ చిట్టితల్లితో అనడమా.... కానీ అనేశాను సుగుణా. ఆమె సున్నితమైన మనసు ఎంత గాయపడుతుందో కూడా ఆలోచించకుండా అనేశాను.

అంతేకాదు అల్లుణ్ణి గురించి వివరాలు కనుక్కున్న మాట నిజమే అయినా, అతను అన్ని రకాలుగా యోగ్యుడని తెలుసుకున్న మాట కూడా నిజమే అయినా మరిన్ని జోడించి అతన్ని గురించి గొప్పగా చెప్పి అమ్మాయిని ఉత్సాహపరిచాను.

నా మాటలకు ఉప్పొంగిపోలేదు. కృంగిపోలేదు. బహుశా 'ఈ నాన్న ఇంతే' వేడిగినవి ఎప్పుడు సమకూర్చాడు కనక' అనుకున్నదేమో పిచ్చితల్లి మౌనంగా తలాడించి తన అంగీకారం తెలిపింది. పసి వయసు నుంచి పెళ్లి వరకు తను కోరింది ఏ ఒక్కటి సమకూర్చలేక పోయాను.మిగిలిన విషయాలన్నింటికి ఎలాగో రాజీపడి నా మనసును నేనే సమాధానపర్చుకున్నా కనీసం పెళ్లి విషయంలో నయినా అమ్మాయి కోరిక తీర్చగలిగి ఉంటే ఇంతమానసికక్షోభ వుండేది కాదేమోనాకు. కాని వారి ఆలోచనా విధానం అంతా ఆర్థిక పరమైన లావాదేవీల్లో ముడిపడి వుండటం గ్రహించిన నేను ధైర్యం చేయలేక పోయాను.

నిజానికి ఈ విషయాలేవీ అమ్మాయికి తెలియవు. దాన్ని అడుగుఅడుగునా మోసంచేశానన్న బాధ నన్ను కృంగదీస్తున్నది.

నా బాధని, ఇబ్బందిని నీవు అర్థం చేసుకొని క్షమిస్తావని ఆశిస్తున్నాను.

ఉత్తరం వ్రాయడం పూర్తిచేసి డాబాపై నుంచి కిందికి వచ్చాడు రంగారావుగారు.

పేరంటం నుంచి తిరిగివచ్చి అప్పటికే అలస్యమయి పోయినట్లు హడావిడిగా వంటపనిలోనిమగ్నమయింది భార్య.

" సుగుణా....నేనలా బయటకు వెళ్లి వస్తాను....ఇదిగో ఇవి చూడు" అనునయంగా అన్నాడాయన.

భర్త చేతిలో కాయితాల వంక అర్థం కానట్లు చూస్తూనే యాంత్రికంగా అందుకుందావిడ.

"ఏమిటండీ ఇవి" ఆశ్చర్యంగా అడిగింది.

ఆయనలా వీధిలోకి నడిచాడు మౌనంగా.

ఉత్తరం చదవటం పూర్తి చేసిన సుగుణమ్మ గారి కళ్లల్లో నీటి సుడులు. కూతురి మీద ప్రేమ, భర్తపై సానుభూతి, తనపై తనకే జాలి.

మనసులో భావాలెలా వున్నా వెంటనే తేరుకున్నదామె. భర్త వచ్చేసరికి చిరునవ్వు చెదరకుండా ఎదురు వెళ్లింది.

"అన్నీ అనవసరమైన ఆలోచన్లు... మీరూ... ఇప్పుడు దానికేం తక్కువయింది. చక్కగా సంసారం చేసుకుంటూన్నది. రేపో మాపో పండంటి బిడ్డను కంటుంది. అప్పట్నుంచి దానికీ తెలిసి వస్తయ్ కష్ట సుఖాలు.


మన శక్తి కొద్దీ చదివించాం. తాహతుకు తగిన సంబంధం కుదిర్చి తాళి కట్టించాం. చాలు మీరు దానికే రకంగానూ అన్యాయం చేయలేదు. అనవసరంగా మనసు కష్టపెట్టకోకండి" చనువుగా, మందలింపుగా అన్నది సుగుణమ్మ.

పొంగి వచ్చే దుఃఖాన్ని దిగమింగుకుని గట్టిగా భార్యను కౌగలించుకున్నాడు రంగారావు.

'ఇదిగో ఇలాంటి మాటల్తోనే నన్ను అప్పట్నుంచి ఇప్పటి వరకూ ఊరడిస్తూ వస్తున్నావు సుగుణా' మనసులో అనుకున్నాడాయన.

# ఏనుగుల కోసం దంతాల వర్తకంపై నిషేధం

దంతాల కోసం ఏనుగుల్ని వధించడం వల్ల గత 10 ఏళ్లలో ఆఫ్రికన్ ఏనుగుల సంఖ్య 609,000కి తగ్గిపోయింది. ఇది ఏనుగుల సంఖ్యలో సుమారు 50 శాతం తగ్గుదల కావడం ఆందోళన కరమైన అంశం. కాగా ఈ పరిస్థితిని నివారించి ఆఫ్రికన్ ఏనుగుల తగ్గుదలను అరికట్టేందుకై ఏనుగులకు సంబంధించిన దంతాలు మాంసం, చర్మం వర్తకాన్ని నిషేధించాలని 103 దేశాలకు సభ్యత్వం గల 'సి.ఐ.టి.ఇ.ఎస్' అనే అంతర్జాతీయ సంస్థ నిర్ణయించింది. ఈ అంతర్జాతీయ సంస్థ ఇటీవల స్విట్జర్లాండ్ లోని లాసేన్‌లో సమావేశం జరిపింది.



సమావేశంలో పాల్గొన్న అమెరికా ప్రతినిధి కాన్స్టన్స్ బి. హారీమన్ మాట్లాడుతూ అమెరికా ఈ నిర్ణయాన్ని హర్షిస్తున్నట్టు చెప్పారు. ఆఫ్రికన్ ఏనుగుల దంతాల దిగుమతిపై అమెరికా, కెనడా, యూరప్ సమాజం, జపాన్ మొదలైన దేశాలు విధించిన నిషేధం వల్ల ఏనుగు దంతాలకు ప్రపంచ మార్కెట్ 75 శాతానికి తగ్గిపోయినట్టు ఆమె చెప్పారు. ఏనుగులను పరిరక్షించే కృషికి తోడ్పడేందుకై అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ, అంతరంగిక విభాగాలకు 20 లక్షల డాలర్లకు పైగా మొత్తాన్ని 1990 ఆర్థిక సంవత్సరంలో అమెరికన్ కాంగ్రెస్ కేటాయిస్తున్నది.

ఏనుగు దంతాలకు విపరీతమైన గిరాకీ ఏర్పడడం వల్లవాటిధరకిలో గ్రాము ఒక్కింటికి 200 డాలర్ల వరకు పెరిగిపోయిందని, దీని వల్ల దంతాల కోసం ఏనుగుల్ని మట్టు పెట్టడం ఎక్కువైందని, ఇప్పుడు ఏనుగు దంతాల వర్తకాన్ని నిషేధించడం వల్ల ఈ గిరాకీని తొలగించి ఏనుగుల్ని కాపాడడానికి అవకాశం ఏర్పడుతుందని హారీమన్ అన్నారు.